క్లుప్తంగా

బీమా సేవలపై అవగాహన



మాట్లాడుతున్న బీఎం గౌతమ్

కవిటి: బ్యాంకింగ్ బీమా సేవలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని బొరివంక ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ గౌతమ్, ఫీల్డ్ ఆఫీసర్ రిష్వంత్ అన్నారు. మాణిక్యపురంలో సర్పంచ్ లలితా సాహూ అధ్యక్షతన మహిళా సంఘాలు, రైతులకు బ్యాంకింగ్ పథకాలతో జోడించబడిన బీమా పథకాలను శుక్రవారం వివరించారు. డిజిటల్ లిటరసీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ, నాయకులు పీఎం తిలక్, సంతోష్‌సాహు, బృందావన్‌దొళాయి పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

మందస: మూలిపాడు పంచాయతీలోని గోపాలపురం గ్రామానికి చెందిన సింగార్పు పున్నయ్య క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మరణించాడు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ గుసిరి వెంకటరావు ద్వారా పున్నయ్య భార్య బాలమ్మకు శుక్రవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు ఆమె ఖాతాలో జమవుతోందని సర్పంచ్ వెంకటరావు చెప్పారు. ఉపసర్పంచ్ రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గౌరహరా మహంతి, సచివాలయం పంచాయతీ కార్యదర్శి బి.రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ దువ్వాడ కీర్తన ఉన్నారు.

జిల్లుండలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మందస: జిల్లుండ గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, సర్పంచ్ చింతాడ శ్రీకావ్య ప్రారంభించారు. రోగులకు సుగర్, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. 200 మందికి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో మందస వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు, జెమ్స్ ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు, పీఆర్వో ఎం.కిషోర్, వైద్యులు నితిన్, అశ్వనికుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శిస్టు బాపూజీ, డొక్కరి పాపారావు, ఫీల్డ్ అసిస్టెంట్ కొర్రాయి లక్ష్మణరావు, ఎల్టీ వై.నాగరాజు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మోదుగ పువ్వులకు డిమాండ్



మోదుగు పువ్వులు అమ్ముతున్న మహిళ

కాశీబుగ్గ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మోదుగ పువ్వులు, మారేడ పత్రిలకు డిమాండ్ పెరిగింది. వీటితో శివుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. దీంతో శుక్రవారం జంట పట్టణాలకు గ్రామీణులు తీసుకొచ్చి విక్రయించిన వీటిని కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూడారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసనలో పారిశుద్ధ్య కార్మికులు

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ బి గిరిబాబుకు వినతి పత్రం అందించారు. సీఐటీయూ నాయకుడు నెయ్యిల గణపతిరావు, కార్మిక నాయకుడు సీహెచ్ మురగన్, బి.కూర్మారావు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి నృత్య పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: మహా శివరాత్రి సందర్భంగా గుళ్లలపాడులో శనివారం జిల్లా స్థాయి నృత్య పోటీలు జరగనున్నాయి. ఆసక్తి కలిగిన నృత్య కళాకారులు పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94919 29589, 98499 37659 నంబర్లను సంప్రదించాలి.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- వాసుదేవుని నిజరూప దర్శనంతో పులకించిన భక్తజనం
- ఆగమశాస్త్రానుసారంగా పూర్ణకుంభాభిషేకం
- తిరుగు పయనమైన స్వాములు



ఆలయ విశిష్టతపై మాట్లాడుతున్న అహోబిలస్వామి



యజ్ఞశాలలో హోమం చేస్తున్న అర్చకులు



సహస్ర కళశార్చన చేస్తున్న దృశ్యం



స్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు

మందస: వాసుదేవుని బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఈ నెల పదో తేదీన ప్రారంభమైన ఉత్సవాల్లో వేలాది మంది భాగస్వాములయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి వాసుదేవుని నిజరూపానికి అభిషేకాన్ని త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి, ప్రధాన అర్చకుడు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, మధుసూదనాచార్యులు, సచ్చిదానందపాఢి, పవన్‌స్వామి, అనిల్‌స్వామి, వేదపండితులు మంత్రోచ్చారణలతో నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూర్ణకుంభాలతో స్వామి పూజలు అనంతరం అభిషేకం కావించారు. స్వామి నిజరూపాన్ని భక్తులు కనులారా తిలకించి తరించారు.

అరుదైనది వాసుదేవుని విగ్రహం

వాసుదేవపెరుమాళుని నిజస్వరూపం ప్రపంచంలోనే అరుదుగా దర్శించుకునే విగ్రహమని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రధాన శిష్యుడు త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి అన్నారు. భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. తిరుమల–తిరుపతి దేవస్థానంలో ఉన్న వెంకటేశ్వరుని మూలవిరాట్‌ను వాసుదేవుడు పోలి ఉన్నాడని చెప్పారు. భగవంతుడంటే భక్తి భావం కలిగి ఉండాలన్నారు. జీవంతో ఉన్న మనిషి మృదుత్వాన్ని విగ్రహం కలిగి ఉంటుందన్నారు. ప్రాకృతమైన సుందరత్వం, కోమలం స్వామి కలిగి ఉంటాడన్నారు. గరుఢ విగ్రహం కూడా అపురూపమైనదన్నారు. మంజూష అంటే నగలపెట్టె అని అర్థమని, ఆ నగల సంపద వాసుదేవుడేనన్నారు. మందస ప్రాంతవాసులు ఎంతో అదృష్టవంతులన్నారు. వాసుదేవుని బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ పండితులు, నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శానాపతి కిశోర్‌కుమార్, జామి ఈశ్వరవెంకటవరప్రసాదరావు, జల్లు కాశీచరణ్, కరతల తిరుపతిరావు, దేవరశెట్టి మార్కండేయులు, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది మాగంటి వెంకటేశ్వరి (హైదరాబాద్), నృత్యకళాకారిణి ఎం.మువ్వ పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సప్తావరణములతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని వేద పండితులు ప్రకటించారు.

రావివలసలో భారీ బందోబస్తు

- సీఐ చంద్రమౌళి



బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్న పోలీసు అధికారులు

టెక్కలి రూరల్: శివరాత్రి సందర్భంగా రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి దేవాస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని టెక్కలి సీఐ చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయం వద్ద బందోబస్తుపై సిబ్బందితో చర్చించారు. ఒక సీఐ, ఆరుగురు ఎస్సైలు, 60 మంది పోలీసులు, 25 మంది సచివాలయ మహిళ పోలీసులు, 50 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

రూట్ మ్యాప్ ఏర్పాటు

రావివలస ఎండల మల్లికార్జున స్వామి దేవాలయానికి వెళ్లేందుకు ప్రధాన మార్గమైన జిల్లాపరిషత్ రోడ్డులో సంతోషిమాత దేవాలయం సమీపంలో కల్వర్ట్ నిర్మాణం పనులు జరుగుతుండడంతో ఆ దారిని మూసి వేసినట్టు సీఐ చెప్పారు. కావున దేవాలయానికి వచ్చే భక్తులు, ఆటోలు స్థానిక చేరీవీధి మీదుగా అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకోవాలని సూచించారు. అలాగే పాలకేంద్ర రోడ్డు మీదుగా అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకుని వెళ్లాలన్నారు. చిన్నబజార్ మార్కెట్ రోడ్డును ఒన్‌వేగా మారుస్తూ దేవాలయం నుంచి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. భక్తులు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

వాటర్‌ప్లాంటు తనిఖీ



వాటర్‌ప్లాంటును తనిఖీ చేస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తపేట జంక్షన్‌లో ఉన్న కొత్తమ్మతల్లి వాటర్‌ప్లాంటును శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మి, విజిలెన్సు అధికారి ప్రేమ్‌కుమార్ సంయుక్తంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంటు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. తగు చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు విజిలెన్సు అధికారి తెలిపారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

టెక్కలి: రెయ్యిపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంఈవో డి.నాగభూషణరావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, ఒక పూట మాత్రమే పాఠశాలను తెరిచి మధ్యాహ్నం మూసేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అమలపాడులో తోటబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: జీడి మామిడిపై ప్రస్తుతం మంచు ప్రభావం అధికంగా ఉన్నందున టీదోమ ఆశించే ప్రమాదం ఉందని.. దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన సహాయకులు కె.ప్రశాంత్ అన్నారు. శుక్రవారం అమలపాడు గ్రామంలో తోటబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీదోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: భూసారానికి కేంద్ర బిందువైన జీవ వైవిధ్యంపై కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. మశాఖపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నూనె గింజలు, పచ్చిరొట్ట ఎరువు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూర, దుంప జాతులను పెంచడం ద్వారా భూమిలోని జీవ వైవిధ్యం పెరిగి, సూక్ష్మజీవులు వృద్ధిపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు పెంపకం వలన భూసారం పెరుగుతుందని మాస్టర్ ట్రైనర్ సత్యన్నారాయణ అన్నారు.

వారంతా టీడీపీ కార్యకర్తలే..

- వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న శాంతారావు, శ్రావణి

వజ్రపుకొత్తూరు: టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు ఆ పార్టీకి చెందిన వారికే పచ్చకండువాలు వేసి ఆహ్వానించడం సిగ్గుచేటని వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు అన్నారు. మహదేవిపురంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడారు. గడిచిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో వార్డు మెంబర్లుగా పోటీ చేసి ఓడిపోయిన వారికి కండువాలు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. వీటిని చేరికలు అంటారా అని ప్రశ్నించారు. టీడీపీలో చేరిన 36 మందిలో తెలంగాణ నుంచి వచ్చిన పాలవలస క్రిష్టారావు, గిరిబాబు, కాంతారావులు ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఓటు బ్యాంకు చెదరదన్నారు. గ్రామంలో ఏ ఒక్కరూ టీడీపీ వైపు చూడలేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చాపర దుర్గా ప్రసాద్, ఉప సర్పంచ్ సుశీల, సంతోష్‌కుమార్, దివ్వల పాపయ్య మాస్టార్, టి.ప్రణీత్‌కుమార్, టి.నాగేశ్వరరావు, పార్వతి, దమయంతి, యశోద, ధనలక్ష్మి, సురేష్ ఉన్నారు.

ప్రతిజీవిలో దైవాన్ని చూడాలి



కార్యక్రమంలో రాజలక్ష్మి తదితరులు

ఇచ్ఛాపురం: భూమిపై ఉన్న ప్రతి జీవిలో దైవాన్ని చూసినప్పుడే అందరూ సంతోషంగా ఉండగలమని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. సురంగి రాజావారి క్రీడా మైదానంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యాలయం (ఓంశాంతి) ఆధ్వర్యంలో వారం రోజులుగా మహాశివునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె హిందూ సంప్రదాయం గొప్పనాన్ని వివరించారు. వెంకటేశ్వర డాన్స్ అకాడమీ చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

అలరించిన బుర్రకథ



బుర్రకథ చెబుతున్న కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: 'ఓ విద్యార్థి మేలుకో..సెల్ ఫోన్ మాయలో పడి జీవితాశయాన్ని మర్చిపోకు, చెడు ప్రవర్తనలతో కుటుంబాన్ని దూరం చేసుకోకు' అంటూ బి.గొనపపుట్టుగకు చెందిన బాలక లోకనాథం బృందం ప్రదర్శించిన సందేశాత్మకమైన బుర్రకథ విద్యార్థులను ఆలోచింపజేసింది. ఈదుపురం ఉన్నత పాఠశాలలో బుర్రకథను శుక్రవారం ప్రదర్శించారు. చెట్లు పెంపకం, మరుగుదొడ్ల వినియోగం, చదువు, ట్రాఫిక్‌రూల్స్ వంటి సందేశాత్మక పాటలు పాడారు. ప్రధానోపాధ్యాయుడు సదాశివుని రాధాకృష్ణన్, ఉపాధ్యాయులు బుర్రకథ కళాకారులను సత్కరించారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సత్కారం



చిట్టిబాబును సత్కరిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి సరైన గుర్తింపు లభిస్తుందని సర్పంచ్ పీత మోహన్‌రావు, ఎంఈవో డి.తులసీరావులు అన్నారు. పెదబడాం ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదోన్నతిపై వెళ్లిన బల్ల చిట్టిబాబును గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధికి చిట్టిబాబు మాస్టార్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ నర్తు చంద్రమోహన్, సర్పంచ్ ఉమాశంకర్, నాయకులు పీత తాతారావు, మన్మథరావు, పాఠశాల కమిటీ చైర్మన్ దట్టి కిరణ్ పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవ్వండి

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



బొడ్డపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కోటబొమ్మాళి: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకునే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. తర్లిపేట సచివాలయం పరిధిలోని జియ్యన్నపేట, బొడ్డపాడు, తర్లిపేట గ్రామాల్లోని పార్టీ నాయకులు, కన్వీనర్లు గృహసారథులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు విన్నారు. అభివృద్ధిపై జియ్యన్నపేటకు చెందిన బాడాన మురళి, సర్పంచ్ బలగ సూర్యారావును అడిగి తెలుసుకున్నారు. బొడ్డపాడులో కాలవలు, సీసీ రోడ్లు ఎక్కడ అవసరమో గుర్తించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, కన్వీనర్లు గేదెల చందరరావు, మొదలవలస హరిప్రసాద్, వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజాబాయ్, సర్పంచ్‌లు సుంకరి జనార్దన, కాల్ల సంజీవరావు, వాన ఆదినారాయణ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పావురాలను ఎగరవేస్తున్న వసంతరెడ్డి, బృందాదేవి తదితరులు

సంతబొమ్మాళి: మహాశివరాత్రి సందర్భంగా జిల్లా స్థాయి ప్రోకబడ్డీ పోటీలు నౌపాడ పంచాయతీ పాల నాయుడుపేట గ్రామంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ పిలక బృందాదేవి జ్యోతి ప్రజల్వన చేయగా జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి టెంకాయ కొట్టారు. అనంతరం శాంతికి చిహ్నంగా పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క భీమారావు, బి.మోహన్‌రెడ్డి, పాల మహేష్‌రెడ్డి, ముదిరి సంజీవ్, పరపటి ధనుంజయరెడ్డి, పిన్నింటి ఎండయ్యరెడ్డి, కోళ్ళ భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పనకు పరిశీలన



నువాసాయి గ్రామాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కంచిలి: నువాగడ పంచాయతీ పరిధిలోని నువాసాయి గిరిజన గ్రామానికి ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం లేదు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో అభ్యర్థనతో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డితో కలిసి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిరాజ్‌ల దృష్టిలో పెట్టారు. దీంతో వారి చర్యల మేరకు విద్యుత్‌శాఖ ఏఈ గురవయ్య, మిగతా సిబ్బంది ఎంపీపీ దేవదాస్‌రెడ్డి నేతృత్వంలో నువాసాయి గ్రామాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ గ్రామానికి సమీప తుట్టాసాయి గ్రామం నుంచి 14 స్తంభాలతో లైన్ ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించడానికి ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ చెప్పారు. పరిశీలనలో పార్టీ నాయకులు ప్రకాశ్‌చంద్ర పండా, పార్టీ సచివాలయ కన్వీనర్ రమేష్ గౌడో ఉన్నారు.

అభాగ్యులకు అండగా..



రోగులను వైద్యశాలకు తరలించే కార్యక్రమంలో లోకేశ్వరరావు తదిరులు

ఇచ్ఛాపురం: అభాగ్యులకు అండగా రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు నిలుస్తున్నారు. గత కొంత కాలంగా మండలం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న మానసిక రోగులను చేరదీసి విశాఖలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు మనోబంధు ఫౌండేషన్ సహాయంతో తరలించి అవసరమైన చికిత్స అందించేలా కృషి చేశారు. ఇప్పటి వరకూ పది మందిని ఆస్పత్రికి తరలించిన ఆయన గురువారం మరో ఇద్దరిని తరలించారు. వ్యాధి మెరుగైన తరువాత వారి స్వస్థలాలకు తీసుకెళ్లి అప్పగించేలా లోకేశ్వరరావు కృషి చేస్తున్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి



నిర్మాణాలను పరిశీలిస్తున్న గణపతి

వజ్రపుకొత్తూరు రూరల్: పేద వాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జగనన్న కాలనీ నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్.గణపతి అన్నారు. పల్లిసారధిలో శుక్రవారం జగనన్న కాలనీ నిర్మాణాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణాలకు అవసరమైన బిల్లులను సకాలంలోనే చెల్లిస్తున్నామన్నారు. హౌసింగ్ ఈఈ జోగారావు, డీఈ ఆర్.అనంతరావు, ఏఈ శ్రీకాంత్, వర్క్ఇన్‌స్పెక్టర్ రాము ఉన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం కోసం..



పలాస చేరుకున్న అమిత్‌గుప్తా, మహన్‌సింగ్

కాశీబుగ్గ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమిత్‌గుప్తా, మహన్‌సింగ్‌లు ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం, లోక కళ్యాణం కోరుతూ భారతదేశంలో 18 నెలలుగా పాదయాత్ర చేపడుతున్నారు. 2022 డిసెంబర్ 20న యాత్ర ప్రారంభించిన వారు శుక్రవారం పలాస రామాలయం వద్దకు చేరుకున్నారు. పలాసలో రాత్రి బస అనంతరం శనివారం ఉదయం పలు శివాలయాలను దర్శించుకుని ప్రయాణం కొనసాగించనున్నట్టు చెప్పారు. వారికి పలాస–కాశీబుగ్గలోని ఆధ్యాత్మిక సంఘసభ్యులు సహకరించారు.

భక్తిశ్రద్ధలతో శివలింగ ఆలయ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న తిలక్ తదితరులు

సంతబొమ్మాళి: కాపుగోదాయవలస గ్రామంలో మహాశివరాత్రి మహోత్సవములో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో శివలింగ ఆలయాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శివలింగాలకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కళింగ కర్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ అంగ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు వాడరేవు జగతి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంగ మల్లేషు, జనార్దనరావు, చిన్ని జోగారావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతికి సంతాపం



మాధవి(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడభద్ర గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బానాన మాధవి (29) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈమెది విజయనగరం జిల్లా రాజాం మండలం బొద్దాం స్వస్థలం. ఆమె మృతిపట్ల గ్రామ సర్పంచ్ జి.గిరిజ, ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జి.ఈశ్వరరావు, భాస్కరరావు, తారకేశ్వరరావు, ధర్మారావు, వై.ఆనంద్, ఎన్.కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంతాపం తెలియజేశారు.